05-07-2025
శనివారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM

ప్రభాత
# జయభేరి

తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 02 | సంచిక : 275 | పేజీలు : 8 | వెల : 5

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి



# దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే

- ప్రధాని మోదీలాగా ఇందిరా గాంధీ భయపడలేదు
- క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని
- ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో ఖర్గే

**జయభేరి, హైదరాబాద్, జులై 04:**

ప్రధాని మోదీలాగా ఇందిరా గాంధీ భయపడ లేదని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే గుర్తు చేశారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్రం ఇస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ అయన ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే.. కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరుతుందని ఏఐసీసీ అధ్యక్షులు, ఎంపీ మల్లికార్జున్ ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. దేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.కానీ వాళ్లు ఈ దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమిటని సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటి వరకు ప్రధాని మోదీ 42 దేశాలు తిరిగారని గుర్తు చేశారు. కానీ ప్రజలు చనిపోతున్నా.. మణిపూర్ రాష్ట్రానికి మాత్రం ఆయన వెళ్లలేదని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను ఏదేదో చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించారన్నారు. కానీ ఎందుకు ఏం చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. పాకిస్తాన్‌పై యుద్ధం చేయకుండా.. మిమ్మల్ని ఎవరు ఆపారంటూ సందేహం వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీలాగా ఇందిరా గాంధీ ప్రధానిగా భయపడ లేదన్నారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం కల్పిస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ అయన ఎద్దేవా చేశారు. రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసి వేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలోనే లేదని బీజేపీ చెపుతుందన్నారు.రాజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తీసేయారని తాను చాలెంజ్ చేస్తున్నానని ఈ సందర్భంగా ఖర్గే ప్రకటించారు. సెక్యులర్ అనే పదం బీజేపీ ప్రణాళికలో రాసుకున్నారని వివరించారు. సెక్యులర్ అనే పదంతో మీకు ఇబ్బంది ఉంటే మీ పార్టీ ప్రణాళిక నుంచి తీసివేయాలని బీజేపీ అగ్రనేతలకు ఖర్గే బహిరంగ సవాల్ విసిరారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే.. అది కార్యకర్తల కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. రేవంత్, భట్టి, మంత్రులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్ని వివరించారు. కేసీఆర్, బీజేపీ కలిసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అడ్డుకుంటున్నారన్నారు. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలను ఓడించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గతంలో తాను చెప్పానని వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కిపైగా కేంద్ర సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణకు ఈ 11 ఏళ్లలో ఏం ఇచ్చారంటూ ప్రధాని మోదీని ఈ సందర్భంగా ఖర్గే సూటిగా ప్రశ్నించారు.

ఢిల్లీలో ఉండే మోడీ అయినా..
గల్లీలోని కేడీ అయినా..
రైతు సంక్షేమం విషయంలో
తేల్చుకునేందుకు రండి..

# సవాళ్లకు సిద్ధం

బీఆర్ఎస్, బీజేపీ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి గట్టి సవాల్



**జయభేరి, హైదరాబాద్, జూలై 4 :**

;ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు గట్టి సవాల్ విసిరారు. కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా వెల్లడించారు. 24 గంటల ఉచిత కరెంట్ , రుణ మాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ,

...మిగతాది 2 లో


అసలు మీరు అధికారంలోకి
# ఎలా వస్తారో మేమూ చూస్తాం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్



**జయభేరి, అమరావతి, జూలై 4 :**

వైసీపీ నాయకులకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 2029లో అధికారంలోకి వస్తే కూటమి నాయకుల అంతుచూస్తామని వైసీపీ నాయకులు అంటున్నారని ఆయన ప్రస్తావించారు. అసలు మీరు అధికారంలోకి రావాలి కదా.. మీరు అధికారంలోకి ఎలా వస్తారో మేమూ చూస్తామని హెచ్చరించారు. ప్రకాశం జిల్లా నరసింహపురంలో తాగునీటి పథకానికి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వైసీపీ నాయకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.ఈ సందర్భంగా కూటమి పార్టీల మధ్య విబేధాలపై పవన్ కల్యాణ్ స్పందించారు. కూటమిలో తనకు, చంద్రబాబుకు మధ్య స్పష్టత ఉందని తెలిపారు. ఎవరి పాత్ర ఏంటనేది తమకు స్పష్టంగా తెలుసని అన్నారు. కూటమిలో కొన్ని విబేధాలు ఉంటే ఉండొచ్చని.. నాయకులు తిట్టుకుంటూ పొడుచుకుంటూ ఉండకూడదని సూచించారు. తమపై ఎంతో నమ్మకంతో ఏపీ ప్రజలు బాధ్యత పెట్టారని తెలిపారు. కూటమిలో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదని అన్నారు. ఒకరిని ఒకరు గౌరవించుకోవాలని సూచించారు. తాము ఏ పార్టీని తగ్గించి మాట్లాడలేదని స్పష్టం చేశారు. అన్ని వేళ్లు ఒకలా ఉండవని.. కానీ అన్ని వేళ్లూ కలిస్తేనే పిడికిలి అని తెలిపారు.వ్యక్తిగతంగా తనకు ఎవరిపై కక్ష ఉందదని పవన్ కల్యాణ్ తెలిపారు. గత ప్రభుత్వం జల జీవన్ మిషన్‌ను పట్టించుకోలేదని అన్నారు. రౌడీయిజం, గూండాయిజంతో భయపెట్టి వేధించారని ఆరోపించారు. మంచినీటిని అందించాలన్న ధ్యాస కూడా గత పాలకులకు లేదని విరుచుకుపడ్డారు. గత పాలకులు లక్షల కోట్లు అప్పులు పెడితే వాటన్నింటినీ తట్టుకుని ఇవాళ ముందుకెళ్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో ఎక్కడ ఖాళీ భూములు కనిపించినా వాటిని దోచేశారని ఆరోపించారు. ఆక్రమణకు గురైన ఆలయ భూములను తిరిగి వెనక్కి తీసుకునే ప్రక్రియ ప్రారంభించామని, వాటికి రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని స్పష్టం చేశారు.



# థాయ్‌ల్యాండ్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు

- ప్రధాని పదవి నుంచి వైదొలిగి.. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పెటంగటార్న్ షినవత్రా

**జయభేరి, న్యూ డిల్లీ జూలై 4:**

థాయ్‌ల్యాండ్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ దేశ ప్రధాని పెటంగటార్న్ షినవత్రా పై వేటు పడిన విషయం తెలిసిందే. దీంతో ఆమె స్థానంలో మరో నేత

...మిగతాది 2 లో

# కోల్ ఇండియా అధిక ప్రాధాన్యం

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**జయభేరి, హైదరాబాద్ జూలై 4:**

ఆత్మనిర్భర్ కు కోల్ ఇండియా అధిక ప్రాధాన్యం ఇస్తోందని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఖనిజాల ఉత్పత్తిలో కోల్ ఇండియా

...మిగతాది 2 లో



# ఈడీ విచారణకు అల్లు అరవింద్..

**జయభేరి, హైదరాబాద్, జులై 4:**

ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ప్రశ్నించారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్‌లో అరవింద్‌ను మూడు గంటలపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. 20182019లో జరిగిన బ్యాంక్ స్కామ్‌లో ఈడీ విచారణను కొనసాగిస్తోంది. ఇందులో మనీలాండరింగ్

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## సవాళ్లకు సిద్ధం

బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని కోరారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు, పథకాలను అమలు చేస్తోందన్నారు సీఎం. అనేక కష్టాలు ఎదురైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నిలబడి, సమస్యలను అధిగమించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించే దిశగా పనిచేస్తోందన్నారు.

**రైస్ ఉత్పత్తి, కొనుగోలు**

ఈ క్రమంలో తెలంగాణ రైతులు ఈ ఏడాది 2 కోట్ల మెట్రిక్ టన్నుల రైస్‌ను ఉత్పత్తి చేసినట్లు సీఎం గుర్తు చేశారు. ప్రజా పాలనలో ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కేవలం 9 రోజుల వ్యవధిలో రూ. 9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భరోసాను అందించడమే కాకుండా, వ్యవసాయాన్ని ఒక పండుగగా మార్చిందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, ఆర్థిక పునరుద్ధరణ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న సామాజిక న్యాయ విజయ భేరి సభలో సీఎం ఈ మేరకు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు అనేక మంది కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఈడీ విచారణకు అల్లు అరవింద్..

కోణం ఉందని భావించిన ఈడీ.. ఈసీఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణను చేపట్టింది. గతంలో బ్యాంక్‌కు సంబంధించి అవకతవకలు జరిగాయన్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతోంది ఈడీ. ఇప్పటికే అల్లు అరవింద్‌ను విచారించిన అధికారులు.. బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారం మరోసారి విచారణకు రావాలని నిర్మాతను ఈడీ అధికారులు ఆదేశించారు.2024లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లోని వివిధ ప్రదేశాలలో సోదాలు చేసిన ఈడీ.. రూ.1.45 కోట్లను సీజ్ చేసింది. నిందితులు రూ.101.48 కోట్ల రుణ నిధులను మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలకు సంబంధించి ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇందులో అకౌంట్ హోల్డర్స్‌గా ఉన్న వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ.100 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలపై ఈడీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

## థాయ్‌ల్యాండ్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు

తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం దేశ మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించారు ఇందులో ప్రధాని పదవి పోగొట్టుకున్న పెటంగటార్న్ షినవత్రాకు కూడా చోటు కల్పించారు. ఆమె కొత్త కేబినెట్ లో మంత్రిగా చేరారు. థాయ్‌ల్యాండ్ రాజు మహా వజ్రలాంగ్‌కోర్న్ ఆమోదంతో గురువారం పెటంగటార్న్ షినవత్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెకు సాంస్కృతికశాఖ బాధ్యతలను అప్పగించారు. ఇక థాయ్‌ల్యాండ్‌కు ఒక్కరోజు తాత్కాలిక ప్రధానిగా సూరియ జంగ్‌రుంగ్‌రియాంగ్‌కిట్ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ప్రస్తుతం హోంమంత్రిగా ఉన్న ఫామ్తామ్ వెచాయచాయ్‌కి తాత్కాలిక ప్రధాన మంత్రి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కొంపముంచిన ఫోన్‌కాల్..**

థాయిల్యాండ్ ప్రధాని పెటంగటార్న్ షినవత్రా పై వేటు వేశారు. ఆ దేశ రాజ్యాంగ కోర్టు ఇవాళ ఆ సస్పెన్షన్ విధించింది. ఓ ఫోన్ సంభాషణలో కంబోడియా మాజీ అధినేత హున్‌సేన్‌ను 'అంకుల్' అని సంబోధించిన పీతోంగ్‌టార్న్.. తమ దేశ సైనిక కమాండర్‌ను తన విరోధి అని పేర్కొనడం వివాదానికి దారితీసింది. దేశ సరిహద్దుల్లో కంబోడియాతో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో స్వయంగా ప్రధాని తమ దేశ సైనిక కమాండర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది.దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. కంబోడియాతో జరిగిన దౌత్య వ్యవహారంలో ప్రధానమంత్రిగా నైతికతను ఉల్లంఘించారని చెప్పడానికి తగిన ఆధారాలున్నాయని కోర్టు పేర్కొన్నది. ప్రధానమంత్రి పదవి నుంచి తప్పిస్తూ రాజ్యాంగ కోర్టు 72 తేడాతో తీర్పును వెలువరించింది. కంబోడియాతో బోర్డర్ చర్చలు నిర్వహిస్తున్న వేళ.. షినవత్రా తన విలువలు మరిచినట్లు కన్జర్వేటివ్ సేనేటర్లు ఆరోపించారు. రాజ్యాంగ తీర్పును సవాల్ చేస్తూ మరో 15 రోజుల్లోగా ప్రధాని షినవత్రా తన వాదనలను వినిపించుకోవాల్సి ఉంటుంది. లేదంటే ఆమె కేసును డిస్మిస్ చేస్తారు. ఒకవేళ పెటంగటార్న్ షినవత్రాను డిస్మిస్ చేస్తే, ప్రధాని బాధ్యతల నుంచి సస్పెండ్ అయిన రెండో వ్యక్తిగా ఆమె నిలుస్తారు.

## కోల్ ఇండియా అధిక ప్రాధాన్యం

కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కోల్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో కిషన్ రెడ్డి ప్రసంగించారు. స్థానికల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా కోల్ ఇండియా చర్యలు చేపట్టిందని, అత్యాధునిక సాంకేతికత వినియోగించి ఖనిజాల ఉత్పత్తి జరుగుతుందని తెలియజేశారు. ఖనిజాల తవ్వకంలో కోల్ ఇండియా పారదర్శకంగా వ్యవహరిస్తోందని, 500 మినరల్స్ బ్లాక్స్ లో లీజ్ రెన్యువల్ సులభతరం చేసిందని చెప్పారు. లీజ్ రెన్యువల్ కు సింగిల్ విండో సిస్టం అందుబాటులోకి తెచ్చిందని, అరుదైన ఖనిజాల ఉత్పత్తిలోకి కోల్ ఇండియా అడుగు పెట్టిందని కిషన్ రెడ్డి ప్రశంసించారు.

ఎమ్మెల్యేల పనితీరుపై ఖర్గే సీరియస్

## పార్టీలో గ్రూపులకు తావుండదన్న కాంగ్రెస్ అధ్యక్షుడు

**✍ జయభేరి, హైదరాబాద్:**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు, నేతల వ్యవహార శైలిపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలో క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నేతలపై ఆయన సీరియస్ హెచ్చరికలు చేశారు. తెలంగాణ పర్యటనలో భాగంగా పార్టీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఖర్గే, "కొంతమంది ఎమ్మెల్యేలు గ్రూపులు కడుతూ పార్టీ విలువల్ని దెబ్బతీస్తున్నారు. ఇలా చేస్తే భయపడతారనుకుంటున్నారా?" అని ఘాటుగా ప్రశ్నించారు. పార్టీ అభివృద్ధికి విరుద్ధంగా ఎవరు పనిచేసినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

**ఖర్గే హెచ్చరికలు:**

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించం. పార్టీకి అనువైన విధంగా లేకుండా అడుగులు వేస్తే అవసరమైన చర్యలు తీసుకుంటాం, అని ఖర్గే హెచ్చరించారు. పదవులు వచ్చాయంటే గర్వించకండి. అవి ప్రజల విశ్వాసంతో వచ్చినవే. వాటిని వినయం, విధేయతతో నిలబెట్టుకోవాలి, అన్నారు.

**గ్రూపు రాజకీయం వద్దు:**

పార్టీలో వర్గీకరణ politicsకు తావులేదని ఖర్గే స్పష్టం చేశారు. "గ్రూపులు కడతారని, పార్టీ మీద ఒత్తిడి తెస్తారని భావించేవారు పొరపాటులో ఉన్నారు," అని వ్యాఖ్యానించారు. పార్టీ శ్రేణుల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం అవసరమని చెప్పారు.

**పార్టీ నిబద్ధతను పటిష్టం చేయాలన్న పిలుపు:**


ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు చేరవేయడంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలన్నారు. 2029 ఎన్నికల దృష్ట్యా యువత, సామాజిక వర్గాలను ఆకర్షించేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు.

**చివరగా ఖర్గే హెచ్చరిక :**

"పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా, అధిష్టానాన్ని తక్కువ అంచనావేయడానికి ప్రయత్నించిన వారిపై తగిన చర్యలు తప్పవు," అని ఖర్గే బలమైన సందేశం ఇచ్చారు. ఈ వ్యాఖ్యలతో పార్టీ అంతర్యానికి స్పష్టత వచ్చిందని, పార్టీలో వర్గపోరాటాలు, అభ్యంతర ధోరణులకు మౌనంగా ఉండబోమన్న సంకేతాలు పంపినట్టయింది. ఎమ్మెల్యేలు, నేతలు ఇప్పటికైనా క్రమశిక్షణకు లోబడి పనిచేయాలని కాంగ్రెస్ హైకమాండ్ బలంగా స్పష్టం చేసినట్టు చెప్పవచ్చు.

# సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగించాలా..?

భారత దేశం అంటేనే లౌకిక దేశంగా పేరు. ఇపుడా లౌకిక అనే పదాన్నే తీసెయ్యాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయ్. అలాగని ఇది అందరి నుంచీ కాదు.. ఒక సెక్షన్ నుంచి మాత్రమే ఈ తరహా డిమాండ్ వినవస్తోంది. రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగించాలి దత్తాత్రేయ హొసబెలే. రాజ్యాంగ పీఠికలోని సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగించాలని RSS నేత చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఎమర్జెన్సీ సమయంలో ఈ పదాలను కాంగ్రెస్ బలవంతంగా చేర్చిందని, దీనిపై చర్చ జరగాలని దత్తాత్రేయ హొసబెలే చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, ఆరెస్సెస్ మాస్క్ తొలిగిపోయిందని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.




బీజేపీ, ఆరెస్సెస్.. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలని చూస్తున్నాయని.. రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. ఇందుకు కొనసాగింపుగా ఉపరాష్ట్రపతి ధన్కర్ సైతం ఇదే వాయిస్ వినిపించారు. రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, లౌకిక అనే పదాలను జోడించడం సనాతన స్ఫూర్తికి విరుద్ధమని అన్నారాయన.1975లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితి దేశ రాజ్యాంగానికే చీకటి కాలమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు. సోషలిస్ట్, సెక్యులరిస్ట్ పదాలు ప్రవేశికలో ఉండాలా వద్దా? అనే దానిపై చర్చ జరగాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబెలే చెప్పిన రెండు రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈ వ్యాఖ్యలు చేయడంతో ఇదో చర్చనీయాంశమైంది. దిగారు. అంతే కాకుండా సనాతన ధర్మానికి విరుద్ధం అన్న కామెంట్లు సైతం చేశారు. సరిగ్గా ఇదే సమయంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సైతం ఇదే అంశంపై కామెంట్ చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రి అయిన శివరాజ్ సింగ్.. భారతదేశంలో సోషలిజం అవసరం లేదని అన్నారు. లౌకిక వాదం మన సంప్రదాయం కాదని అన్నారు. ఎమర్జెన్సీలో వీటిని చేర్చారనీ.. ఇది అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలో భాగం కానే కాదని అన్నారాయన. భారత్ మే సమాజ్ వాద్ కీ జరూరత్ నహీ హై, ధర్మ నిరపేక్ష్ హమార సంస్కృతి కా మూల్ నహి హై.. ఔర్ ఇస్లియే పర్ జరూర్ విచార్ హోనా చాహియే.. అన్నారు. దీనర్థమేంటంటే.. భారతదేశంలో ఈ రకమైన పదాలు మనకు అవసరం లేదని అన్నారు చౌహాన్. కాబట్టి, దీనిపై చర్చించాలి అన్నది ఈ వ్యాఖ్యల సారాంశం. ఒకరకంగా చెబితే.. ఇది ఆర్ఎస్ఎస్ పిలుపునకు పరోక్ష మద్దతుగా భావిస్తున్నారు. లౌకిక వాదం మనది కాదన్న అస్సాం సీఎం హిమంత. ఇక ఇదే అంశంపై మరొక నేత కూడా కామెంట్ చేశారు. ఆయనే.. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ. సోషలిజం, లౌకికవాదం మనవి కావు. పాశ్చాత్య భావనలని, ఈ పదాలకు భారత నాగరికతలో స్థానం లేదని అన్నారు. మీరు కాస్త గట్టిగా ఆలోచిస్తే మన అస్తిత్వ సవాళ్లకే మనం అవకాశమిస్తున్నామని.. ఇదొక చీడ పురుగుగా దేశాన్ని పట్టి పీడిస్తోందని అన్నారు ఉప రాష్ట్రపతి. ఇది వేల సంవత్సరాల నాగరికతను కించ పరుస్తోందని.. ఈ సెక్యులరిజం అన్నది మనదైన సంప్రదాయాన్ని తక్కువ చేసుకోవడం తప్ప మరొకటి కాదని అన్నారు ధన్కర్. ఇది సనాతన ధర్మానికే పూర్తి అవమానకమని కామెంట్ చేశారు ధన్కర్. ఉపరాష్ట్రపతి ధన్కర్ కి రచయిత, మాజీ కర్ణాటక ఎమ్మెల్సీ వీరయ్య రాసిన సంకలనం అంబేద్కర్ సందేశాలు అనే పుస్తకం తొలి కాపీ అందించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ జగదీప్ ధన్కర్ ఈ కామెంట్లు చేశారు. ఆర్ఎస్ఎస్ అగ్ర నేత నుంచి ఉపరాష్ట్రపతి వరకూ ఈ తరహా కామెంట్లు చేయడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోంది కాంగ్రెస్. తర్వాత మురుగన్ మానాడు సభలోనూ పవన్ సరిగ్గా ఇలాంటి సెక్యులరిస్టు కామెంట్లు చేశారు. ఇది గత కొంతకాలంగా భారతదేశంలో వినిపిస్తున్న మాట. ఆ మాటకొస్తే మొన్న పూనేకి చెందిన లా స్టూడెంట్ శర్మిష్ట పనోలీ విషయంలోనూ సరిగ్గా ఇలాగే కామెంట్ చేశారు పవన్. దేశంలో సెక్యులరిజం అంటే అది హిందుత్వ వాదులను అనడానికి మాత్రమే పనికొచ్చే ఒకానొక వెసలుబాటు కాదని కామెంట్ చేశారాయన.

ఈ ధోరణి వెనక రాజ్యాంగంలోని ఈ సెక్యులరిస్ట్ పదాలే కారణమన్నది వీరందరి వాదనగా తెలుస్తోంది. 1976లో అత్యవసర పరిస్థితి సమయంలో 42వ రాజ్యాంగ సవరణలో భాగంగా లౌకిక, సోషలిస్ట్ అనే రెండు పదాలను ప్రవేశికలో చేర్చారు. అత్యవసర పరిస్థితి తర్వాత అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం 42వ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేసిన అనేక ఇతర మార్పులను తిప్పికొట్టినప్పటికీ, అది సోషలిస్ట్, సెక్యులరిస్ట్ అనే పదాలను అలాగే ఉంచింది. వాస్తవానికి, 2014లో నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, నాటి బిజెపి అధ్యక్షుడు అమిత్ షా 2015లో పార్టీ లైన్‌ను స్పష్టం చేశారు. నేటి పీఠిక అలాగే ఉండాలని బిజెపి విశ్వసిస్తుంది. దానిని మార్చాల్సిన అవసరం లేదని అన్నారు. బేసిగ్గా చూస్తే ఇప్పటి వరకూ భారత్ కి రక్షణ కవచం ఈ లౌకిక వాదమే. పాకిస్థాన్ లా ఒక మత తత్వ దేశంగా భారత్ మారితే.. దాని విస్తృత రూపం రేపటి రోజున మరొక విధంగా మారే అవకాశం లేక పోలేదు. కానీ బీజేపీ చూస్తుంటే భారత్ ని లౌకిక వాదం నుంచి పక్కకు తప్పించేందుకు తీవ్ర యత్నాలు చేస్తున్నట్టే కనిపిస్తోందని అంటారు రాజ్యాంగ నిపుణులు. ఏం పాకిస్థాన్ మన నుంచి విడిపోయి ఇస్లామిక్ కంట్రీగా మారినపుడు మన దేశం హిందూ దేశం ఎందుకు కాకూడదన్నది రెగ్యులర్ గా సంఘ్ పరివార్ సభ్యులు వేసే ప్రశ్న. వీరి ఆలోచన ప్రకారం భారత దేశం ఇప్పటి వరకూ లౌకిక వాదం, సామ్యవాదం ద్వారా నష్టపోయినట్టుగానే చెప్పాల్సి ఉంటుంది.

సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగిస్తే ఏం జరుగుతుంది? ఒక వేళ సోషలిస్ట్, సెక్యులర్ అనే పదాలు తొలిగిస్తే ఏం జరుగుతుంది? అని చూస్తే అది దేశ స్వరూప స్వభావాలను పూర్తిగా మార్చే అవకాశం కనిపిస్తోంది. రాజ్యాంగ సూత్రాలు, విలువలు కూడా బొత్తిగా మారిపోయే ఛాన్సుంది. అంతే కాదు సామాజిక, ఆర్థిక సమానత్వం.. మత స్వేచ్ఛ వంటి అంశాలపై ఇది తన తడాఖా చూపించవచ్చని అంటారు రాజ్యంగ నిపుణులు. ఒక వేళ సోషలిస్ట్ అనే పదం తొలగిస్తే.. దేశ సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం తయారు చేసిన రాజ్యాంగ లక్ష్యాన్నిది బలహీనపరుస్తుంది. సంపద, వనరుల సమాన పంపిణీ, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఇది తీవ్ర ప్రభావం చూపవచ్చని హెచ్చరిస్తారు కొందరు నిపుణులు. సెక్యులర్ అనే పదం తొలగిస్తే, మతపరమైన స్వేచ్ఛ కూడా కోల్పోయే ప్రమాదముంది. మతం ప్రాతిపదికన వివక్షకు వ్యతిరేకంగా ఉన్న రాజ్యాంగ సూత్రం మరింత ఇరుకున పడుతుంది. ప్రభుత్వం కూడా మతం పరంగా పక్షపాత ధోరణిని అవలంబించే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ రెండు పదాల కారణంగా దేశంలో సామాజిక న్యాయం. ఈ రెండు పదాలు రాజ్యాంగ ప్రవేశికలో చేర్చడం ద్వారా, భారత రాజ్యాంగం సమగ్రత, లౌకికవాదం.. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నట్టు కనిపిస్తుంది. వీటిని తొలగిస్తే, రాజ్యాంగ విలువలు మరింత పలుచనయ్యే అవకాశం కనిపిస్తోందని అంటారు రాజ్యాంగనిపుణులు. ఇతర దేశాలు కూడా ఈ మార్పును గమనించి, భారతదేశంతో సంబంధాలు నెరిపే విధానాన్ని మార్చుకోవచ్చు. ముఖ్యంగా ఇతర దేశాలలో లౌకికవాదం, సామాజిక న్యాయం పట్ల ఆసక్తి ఉన్నవారిలో మన పట్ల ఇప్పటి వరకూ ఉన్న ధోరణి మారవచ్చు. సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగిస్తే, భారత రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలు, విలువలు దెబ్బతినే అవకాశం ఉంది. సామాజిక ఆర్థిక సమానత్వం మతపరమైన స్వేచ్ఛ వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం చూపేలా తెలుస్తోంది. అందుకే రాహుల్, దత్తాత్రేయ అన్న వెంటనే తీవ్రంగా రియాక్టయ్యారు.



# ముగ్గురిలో ఎవరా బిగ్ లక్కీ హ్యాండ్

**✍ జయభేరి, హైదరాబాద్, జూలై 4 :**

దేశవ్యాప్తంగా ఫుల్ స్వింగ్‌లో ఉంది కమలం పార్టీ..! వరుసబెట్టి విజయాలు సాధిస్తూ.. ఓ రేంజ్‌లో హవా కంటిన్యూ చేస్తోంది. మరి అలాంటి పార్టీకి కాబోయే కొత్త చీఫ్ ఎవరు..? అమిత్‌షా, రాజ్‌నాథ్, నడ్డా లాంటి అగ్రనేతల తర్వాత ఆ పీఠాన్ని ఎక్కబోయే నాయకుడెవరు..? అన్నదీ దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలోనే ప్రధానంగా వినిపిస్తున్న ముగ్గురిలో ఎవరా బిగ్ లక్కీ హ్యాండ్..?హ్యాట్రిక్ విక్టరీతో అధికారంలోకి వచ్చిన కమలం పార్టీ అదే జోష్ కంటిన్యూ చేస్తోంది. ప్రత్యర్థులకందని వ్యూహాలతో అన్ని రాష్ట్రాల్లోనూ బలోపేతమవుతోంది. మరలాంటి కాషాయ పార్టీకి కాబోయే బాస్ ఎవరన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. జేపీ నడ్డా తర్వాత జాతీయాధ్యక్షుడిగా ఎవరు వస్తారని అటు పార్టీతో పాటు ఇటు దేశ రాజకీయ వర్గాలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. అయితే జూలై రెండో వారంలో బిగ్ అనౌన్స్‌మెంట్ ఉండే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో అధ్యక్షుల ఎన్నిక పూర్తవ్వడం.. జాతీయ అధ్యక్ష ఎన్నికకు అవసరమైన కోరం ఉండటంతో.. బీజేపీ చీఫ్ ఆన్ ద వే అన్న టాక్ ఢిల్లీలో గట్టిగా వినిపిస్తోంది.బీజేపీ పార్టీ రాజ్యాంగం ప్రకారం జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియకు ముందు కనీసం 19 రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షుల ఎన్నిక తప్పనిసరి. అయితే ఇప్పటి వరకు 28 రాష్ట్రాల్లో విజయవంతంగా అంతర్గత సంస్థాగత ఎన్నికలు పూర్తయ్యాయి. ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల్లో ఇంటర్నల్ ఎలక్షన్ ఈ వారం పది రోజుల్లో పూర్తవుతుంది. ఆ వెంటనే జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఈసారి పార్టీ పెద్ద మార్పు వైపు పయనిస్తోంది. మొదటిసారిగా భారతీయ జనతా పార్టీ ఆధిక్యాన్ని ఒక మహిళకు అప్పగిస్తారని తెలుస్తోంది. ఇటీవల ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో పార్టీ మంచి పనితీరును కనబరిచింది. ఈ కారణంగా, ఒక మహిళను ఢిల్లీ ముఖ్యమంత్రిగా కూడా చేశారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా మహిళలను ఆకర్షించడానికి, ఒక మహిళను పార్టీ అధ్యక్షురాలిగా చేయవచ్చని తెలుస్తోంది. నిజానికి, ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు జె.పి. నడ్డా పదవీకాలం జనవరి 2023లో ముగిసింది, కానీ పార్టీ అతనికి జూన్ 2024 వరకు మరిన్ని బాధ్యతలు అప్పగించింది. ఇప్పుడు కొత్త పేరును త్వరలో ప్రకటించవచ్చు. తదుపరి పార్టీ అధ్యక్షురాలు మహిళ కావచ్చు. దీనికి ముగ్గురి పేర్లు ముందంజలో ఉన్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మాజీ కేంద్ర మంత్రి డి. పురందేశ్వరి, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వానతి శ్రీనివాసన్ లలో ఎవరినైనా ఒకరు బీజేపీ బాధ్యతలు చేపట్టే అవకాశముందని తెలుస్తోంది.

**నిర్మల సీతారామన్**

ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్టీలో బలమైన పట్టును ఏర్పరచుకున్నారు. ఆమెకు కేంద్ర ప్రభుత్వంలో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆమె ఇటీవల బీజేపీ ప్రధాన కార్యాలయంలో జెపి నడ్డా, జనరల్ సెక్రటరీ బిఎల్ సంతోష్‌లతో సమావేశమయ్యారు. ఆమె దక్షిణ భారతదేశం నుండి రావడం బీజేపీ మరింత విస్తరణకు మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు.

**వానతి శ్రీనివాసన్**

వానతి తమిళనాడులోని కోయంబత్తూర్ సౌత్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా ఉన్నారు. ఆమె చాలా కాలంగా పార్టీ కోసం పనిచేస్తున్నారు. వానతి 1993 నుండి బీజేపీలో ఉన్నారు. పార్టీలో అనేక ముఖ్యమైన పదవులను నిర్వహించారు. బీజేపీ జాతీయ అధ్యక్షురాలిగా పోటీలో ఆమె ముందున్నారు.

**దగ్గుబాటి పురందేశ్వరి**

డి. పురందేశ్వరి ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ మాజీ అధ్యక్షురాలుగా పని చేశారు. రాజకీయంగా చాలా అనుభవజ్ఞురాలైన నాయకురాలు. గతంలో కేంద్ర మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆమె ఆపరేషన్ సింధూర్ ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు. పార్టీ పురందేశ్వరిని చాలా విశ్వసిస్తుంది. అందువల్ల, ఆమె పేరును కూడా ఆమోదించవచ్చని తెలుస్తోంది. కొత్త జాతీయ అధ్యక్షుడి ఎంపికలో సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, రాబోయే ఎన్నికలను పరిగణనలోకి తీసుకోనున్నారు. పలువురు కేంద్రమంత్రుల పేర్లు సైతం చర్చకు రావడంతో.. కేంద్ర కేబినెట్‌లో మార్పులు, కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మంత్రివర్గ విస్తరణలు జరిగే అవకాశాలున్నాయి. ప్రధాని మోదీ ఐదు దేశాల పర్యటనకు వెళ్లొచ్చాక.. జూలై రెండో వారంలో కొత్త జాతీయ అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఎవరా లక్కీ మ్యాన్ అన్నది తేలాలంటే ఓ వారం పదిరోజులు ఆగాల్సిందే..!

# తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం..

- భూభారతి , రేషన్ కార్డుల ఎల్ ఆర్ ఎస్ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశం






**జయభేరి, శామీర్ పేట్, జులై 4 :**

భూభారతి, రేషన్ కార్డులు, ఎల్ ఆర్ ఎస్ పెండింగు లను సాధ్యమైనంత తొందరగా పరిష్కరించాలని, అవసరమైన చోట మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తహసీల్దార్లను, మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి, రేషన్ కార్డులు, ఎల్ ఆర్ ఎస్ అంశాల పై నిర్వహించిన సమీక్షా సమావేశానికి అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్ రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టరు మను చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో మండలాల, మున్సిపాలిటిల వారిగా భూభారతి, రేషన్ కార్డులు, ఎల్ఆర్ఎస్ పెండింగ్ కు గల కారణాలను తహసీల్దార్లను, మున్సిపల్ కమీషనర్లను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలకు సంబంధించిన కోర్టు కేసులను, లిటిగేషన్ లో ఉన్న ప్రభుత్వ భూముల ఫిజికల్ పొజిషన్ పరిశీలించి తన దృష్టికి తీసుకురావాలని కలెక్టరు సూచించారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులను తిరస్కరించేందుకు గల కారణాలను తెలుపుతూ నివేదికలు పంపాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ భూములను కబ్జాకు గురి కాకుండా కాపాడాలని తహసీల్దార్లను కలెక్టరు ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో ఎక్కువగా పెండింగ్ ఉన్నరేషన్ కార్డుల గురించి కలెక్టర్ ఆరా తీసారు. త్వరితగతిన రేషన్ కార్డులు పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేయాలని కలెక్టరు సూచించారు. జిల్లాలో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పై సమీక్ష నిర్వహిస్తూ ఎల్ ఆర్ ఎస్ కట్టిన వారికి ప్రొసిడింగ్స్ అందించాలని, అవసరమైన వాటికి క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మకంగా ఉన్న దరఖాస్తులకు సంబంధించిన వివరాలను తనకు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు కూడా చాలా వరకు పెండింగ్ లో ఉన్నవని వాటిని కూడా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహసీల్దార్లను, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మండలాల, మున్సిపాలిటిల వారిగా తహసీల్దార్లకు, మున్సిపల్ కమీషనర్లకు సమస్యలను పరిష్కరించేందుకు తగు సలహాలను సూచనలను కలెక్టరు అందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్లు,మున్సిపల్ కమీషనర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## బిఆర్ఎస్వి నాయకులు ముందస్తు అరెస్ట్

**జయభేరి, డిండి :**

శుక్రవారం నిరుద్యోగులు చలో సెక్రటేరియట్ కి పిలుపునిచ్చిన నేపథ్యంలో బిఆర్ఎస్వి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నెరవేర్చకుండా నిరుద్యోగులను మోసం చేసినా రేవంత్ రెడ్డి అని ఆయన గుర్తు చేశారు.ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తా అని చెప్పిండో తక్షణమే జాబ్ క్యాలెండర్ ను ప్రకటించాలి. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నిర్బంధపాలన కొనసాగిస్తున్నాడు అని ఆయన తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు గుర్రం సురేష్ నేత, బుషిపాక సాయి తదితరులు ఉన్నారు.

## అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని కొనసాగించలేరు

- ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నెరవేర్చకుండా నిరుద్యోగులను మోసం చేసినా రేవంత్ రెడ్డి
- బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ నిరుద్యోగులు చలో సెక్రటేరియట్ కి పిలుపునిచ్చిన నేపథ్యంలో బిఆర్ఎస్వి నాయకులు అరెస్ట్




**జయభేరి, దేవరకొండ :**

అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని కొనసాగించలేరు అని బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ లు అన్నారు. శుక్రవారం నిరుద్యోగులు చలో సెక్రటేరియట్ కి పిలుపునిచ్చిన నేపథ్యంలో బిఆర్ఎస్వి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నెరవేర్చకుండా నిరుద్యోగులను మోసం చేసినా రేవంత్ రెడ్డి అని ఆయన గుర్తు చేశారు.ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తా అని చెప్పిండో తక్షణమే జాబ్ క్యాలెండర్ ను ప్రకటించాలి. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నిర్బంధపాలన కొనసాగిస్తున్నాడు అని ఆయన తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు పాత్లవత్ లక్ష్మణ్, యువజన విభాగం అధ్యక్షుడు పొట్ట మధు ,SK జామీర్ బాబా తదితరులు ఉన్నారు.

## అక్రమ అరెస్టులతో బిఆర్ఎస్ పార్టీ నాయకులను ఆపలేరు



**జయభేరి, చింతపల్లి :**

అక్రమ అరెస్టులతో బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఉద్యమాలను ఆపలేరని చింతపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు.నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న AICC అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ లో భాగంగా అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల నిరసన కార్యక్రమం సందర్భంగా నేడు చింతపల్లి పోలీసులు బిఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘ విద్యార్థి యువజన సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేసి అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు... కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు మా ఉద్యమాలు మరింత ఉధృతంగా నిర్వహిస్తామని తెలియజేస్తున్నాము మీరు ఎన్ని అక్రమ అరెస్టులు చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నల్ల శంకర్ వందనపు ఆంజనేయులు, ఉప్పల యాదయ్య, మైనార్టీ నాయకులు కాలేధ్, బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు ఆరెకంటి మురళి మాదిగ ,బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు సీమర్ల శ్రీను యాదవ్ ,ఆరెకంటి పృధ్వీరాజ్, రాశిక శ్రీశైలం, మాసాని పవన్ తదితరులున్నారు.

## క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా దామర శ్యామ్సన్ ఎన్నిక



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని 12వార్డుకు చెందిన దామర శ్యామ్సన్ మున్సిపాలిటీ BC క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా సామజిక వేత్త BC సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దామర శ్యామ్సన్ మాట్లాడుతు నా మీద నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వార్డులలో BC క్రిస్టియన్ విభాగం కమిటీ నిర్మాణం, బీసీ సమస్యలపై, బీసీలను చైతన్యం చేస్తూ, 42 శాతం రిజర్వేషన్ పై ప్రభుత్వ మొండి వైఖరిని అందరికి వివరిస్తూ BC ల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలియజేశారు.



## కల్తీ మద్యం కేసులో కీలక సూత్రధారులను తప్పించే ప్రయత్నం మానుకోవాలి

- టీడీపీ పరవాడ గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్రి చంద్రశేఖర్

**జయభేరి, పరవాడ :**

పరవాడ కేంద్రంగా జరుగుతున్న స్పిరిట్ మద్యం వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం వెలుగులోకి తెచ్చిందని ఈ కేసులో కీలక సూత్రధారులను తప్పించేందుకు ఎక్సైజ్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారని పరవాడ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్రి చంద్రశేఖర్ ప్రతిక ప్రకటన ద్వారా ఆరోపించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ఇలా స్పిరిట్ తో దొంగ మద్యం తయారు చేస్తున్న వ్యక్తులను నిఘా పెట్టి అదుపులోకి తీసుకున్నరని కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నాణ్యమైన మద్యాన్ని తయారుచేసి ప్రజలకు అందిస్తుందని తెలియజేసారు. ధనర్జనే పరమావారధిగా ప్రజల ఆరోగ్యం గాలికి వదిలేసి లాభర్జన అలవాటపడ్డ కొంతమంది చర్యలు వలన ప్రభుత్వంకి చెడ్డ పేరు వస్తుందని కల్తీ మద్యంను మద్యంషాపులకే కాకుండా బెల్ట్ షాపులకి సరఫరా చెయ్యడం వలన ప్రజా ఆరోగ్యం చెడిపోయాయి అని ఇలాంటి వారిని కేసు నుంచి తప్పించడానికి అధికారులే పూర్తి బాధ్యత తీసుకోవడం చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయంకి కళ్ళు కప్పి అసలు సూత్రాదారులని వదిలేయ్యడం వంటి చర్యలు చెయ్యడం వలన ప్రజలకు వ్యవస్థల పై ఉన్న నమ్మకాలు పోతున్నాయని తెలిపారు. మద్యం కేసులో అసలు నిందుతులను ఎవ్వరో నిగ్గు తేల్చాలని లేదంటే గ్రామ ప్రజలతో కలిసి తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని చంద్రశేఖర్ తెలిపారు.

## 14 లోపు కొత్త రేషన్ కార్డుల కోసం అప్లై చేసుకోండి



**జయభేరి, తుర్కపల్లి, జూలై 04 :**

జులై 14 లోపు కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఉమ్మడి నల్లగొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేయడం జరుగుతుందని, కొత్తగా పెళ్లయిన వారు, పుట్టిన పిల్లలకు రేషన్ కార్డులో ఆడిట్ చేయుటకు ప్రభుత్వం ఈనెల 14వ తేదీ వరకు గడువు ఇచ్చినందున త్వరితగతిన అప్లై చేసుకొని కొత్త రేషన్ కార్డులను తీసుకోవాలని కోరారు.

# మహనీయుల ఆశయ సాధనకై కృషి చేయాలి

- స్వామి వివేకానంద 123వ వర్ధంతి, పింగళి వెంకయ్య 62వ వర్ధంతి, దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి, అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు
- సామాజికవేత్త జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ పిలుపు

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 123వ వర్ధంతి, పింగళి వెంకయ్య 62వ వర్ధంతి దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలను ఘనంగా జరిపారు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మహనీయులు ఆశయ సాధన కోసం కృషి చేయాలని నేటి యువతరం స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర పోరాటంలో మన్యంలో ఉన్నటువంటి తెల్లదొరలను తరిమికొట్టి ఉద్యమ నాయకుడని స్వాతంత్ర సమరయోధుడు పింగళి వెంకయ్య భారత దేశ స్వాతంత్రం సిద్ధించిన అనంతరం జాతీయ జెండా రూప కల్పన కర్తగా పేరు పొందిన వ్యక్తి అని అదేవిధంగా దొడ్డి కొమరయ్య కమ్యూనిస్టు వాదిగా ప్రజల సమస్యలపై పోరాటం చేసి ఉద్యమించి భూ పోరాటాలలో ప్రజలలో వెన్నుదండుగా ఉండి ప్రజాసేవ అందించిన గొప్ప బహుజన నాయకుడుగా గుర్తింపు పొందిన నాయకుడుఅని వీరి ఆశయాల సాధన కోసం బహుజనులందరూ ఐక్యమై రాజ్యాధికార దిశగా ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల శ్రీను ఆర్మీ, అబ్దుల్ కలాం,లావుడియా భాష నాయక్, వీరయ్య అప్పం, రెడ్డి కోటేశ్వరరావు , పత్లావత్ లక్ష్మణ్ నాయక్,చిత్రం ఏసూబ్, వస్కుల ఏసూబ్, లింగంపల్లి గోవిందు ,కానుగుల యాదయ్య, సుధాకర చారి, గండూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# హై స్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


**జయభేరి, తుర్కపల్లి, జూలై 04 :**



తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అనుదీప్ సొసైటీ ఏఎస్ రావు నగర్ వారి ఆధ్వర్యంలో బల్ల ఉపేందర్ రావు రిటైర్డ్ టీచర్ చొరవతో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అనుదీప్ సొసైటీ తరపున పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్సిల్లు అందివ్వడం సంతోషకరమైన విషయం అని అన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.
మంచిగా చదువుకునే విద్యార్థులకు ఇలాంటి సొసైటీలు దాతలు అండగా ఉండడం అభినందనీయమని అన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే అనేక సొసైటీలు పనిచేస్తున్నాయని అనుదీప్ సొసైటీ మన పాఠశాలతో అసోసియేట్ కావడం ముదావహం అన్నారు. అనుదీప్ సొసైటీ ప్రతినిధి నూలు రామచంద్ర రావు మాట్లాడుతూ అనుదీప్ సొసైటీ విద్యార్థుల శ్రేయస్సు కోసం ఈ చక్కటి కార్యక్రమాన్ని చేపట్టిందని వీటిని సరియైన విధంగా వినియోగించుకోవాలని, మార్కుల కోసం కాకుండా కాన్సెప్ట్ అర్థం చేసుకుంటూ నిజ జీవితానికి ఆయా అంశాలను జోడిస్తూ మంచి ఉన్నత విలువలు కలిగిన వ్యక్తులుగా ఎదగాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో తరగతిలో మంచి మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేసా శ్రీనివాసాచారి, పెద్ది బిక్షమయ్య, పలుగుల సతీష్ కుమార్, దూదిపాల జ్యోతి, చింతలపూడి విశ్వేశ్వరరావు, ముసుకుల సుజాత, శ్రీరాంభట్ల మాధురి, బాశెట్టి విష్ణు, బీరవెల్లి హరిత, బండి మధుకర్, రాజమైన అంబాజి, అదరాసుపల్లి వెంకటలక్ష్మి, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోశయ్య ఆదర్శప్రాయుడు

**జయభేరి, వనపర్తి :**



స్వర్గీయ కొనజేటి రోశయ్య నేటి సమాజానికి ఆదర్శ ప్రాయుడని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా టూరిజం. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఐ డి ఓ సి ప్రాగణంలో నిర్వహించిన స్వర్గీయ కొనజేటి రోశయ్య 93వ జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రసంగిస్తూ కొనజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల గవర్నర్ గా బాధ్యతలు నిర్వహించారనిఅన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆ రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడపడాన్ని తన వంతుసహకారం అందించారని కొనియాడారు. చిత్రంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి. వనపర్తి జిల్లా టూరిజం పర్యాటక సాంస్కృతిక అధికారి వనపర్తి జిల్లా డి ఆర్ డి ఏ పి డి. పి. ఉమాదేవి. వనపర్తి జిల్లా మీడియా పౌర సమాచార అధికారి పి. సీతారాం నాయక్. వనపర్తి జిల్లా కరెక్టర్ సీసీ కిరణ్ కుమార్ రెడ్డి. వనపర్తి జిల్లా కలెక్టర్ రేట్ పరిపాలన అధికారి భాను ప్రకాష్. మీడియా ఏపీఆర్వో సుభాష్ సాగర్ యూనియన్ బ్యాంక్ అధికారులు తదితరులు ఉన్నారు.



## మున్సిపల్ కమిషనర్ ను కలిసిన మాజీ కౌన్సిలర్ రాజ్ కుమార్ యాదవ్

**జయభేరి, శామీర్ పేట్, జులై4 :**
తుంకుంట మున్సిపల్ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎం, ఎన్. ఆర్ జ్యోతి ని తుంకుంట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రాజ్ కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయన కమిషనర్ ను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్చం అందించారు. కాగా మున్సిపాలిటీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. అయితే దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

## లాలు నాయక్ సేవలు చిరస్మరణీయం

- పేద ప్రజల పక్షపాతి లాలు నాయక్



**చందంపేట :**
లాలు నాయక్ చేసిన సేవలు చిరస్మరణీయం అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు . చందంపేట మండలం బిల్డింగ్ తండా వద్ద రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రమావత్ లాలు నాయక్ 5వ వర్ధంతి సందర్భంగా లాలూ నాయక్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....పేద ప్రజల పక్షపాతి లాలు నాయక్ అని ఆయన కొనియాడారు. లాలు నాయక్ కుటుంబానికి అండగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జర్పుల లోక్య నాయక్, కేతావత్ శంకర్ నాయక్, మాజీ జెడ్పిటిసి ముఖ్య సలహాదారులు రమావత్ మోహన్ కృష్ణ, రమావత్ రమేష్, శోభన్,తదితరులు పాల్గొన్నారు.

## వర్షం దెబ్బకు గుంతలతో దర్శనం ఇస్తున్న ఫార్మాసిటీ ప్రధాన రహదారి

- మూడు నెలల్లోనే గుంతలుగా మారిన లంకెలపాలెం టు పరవాడ రహదారి



**జయభేరి, పరవాడ:**
అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో లంకెలపాలెం నుండి పరవాడ వైపుగా వెళ్లే ప్రధాన రహదారి మొన్న పడిన వర్షాలకి గుంతలు గుంతలుగా మారి అటుగా వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణం చేస్తూ ఉన్న ఈ రహదారి గురించి నాయుకులు,పాలకులు పట్టించుకొన్న రోజులు లేవు.కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత తూతూ మంత్రంగా రహదారి మార్మతులు చేసిన అవి మూడు నెలలు తిరగక ముందే ఇలా తయారవ్వడం స్థానిక ప్రజానీకానికి ఆశ్చర్యం కల్గిస్తుంది.ప్రభుత్వ కార్యక్రమాలకి అధికారులు నాయుకులు ఈ రహదారి గుండా ప్రయాణం చేస్తున్న ప్రజలు పడుతున్న ఇబ్బందులు కనపడకపోవడం నాయుకులకు ఈ ప్రాంతం పై ఉన్న శ్రద్ధ ఏ మాత్రమో అర్థం పడుతుంది.ఇప్పటికయినా స్థానిక నాయుకులు అధికారులు స్పందించి రహదారికి పూర్తి మార్మతులు చేసే చర్యలు చేపట్టాలని ప్రయాణికులు ,ప్రజలు కోరుతున్నారు.

## యశోద ఆస్పత్రిలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆరోగ్యంపై ఆరా తీసిన కవిత



**జయభేరి, హైదరాబాద్, జూలై 4:**
యశోద ఆస్పత్రికి ఎంఎల్ సి కల్వకుంట్ల కవిత చేరుకుని కెసిఆర్ ఆరోగ్యంపై ఆరా తీశారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జ్వరం, మధుమేహ సంబంధిత సమస్యలతో యశోద ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెసిఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. గురువారం సాయంత్రం స్వల్ప నీరసంతో తమ ఆసుపత్రిలో చేరినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక పరీక్షలలో అధిక బ్లడ్ షుగర్ లెవెల్స్‌తో పాటు తక్కువ సోడియం స్థాయి ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని అన్నారు. మధుమేహం నియంత్రణ కోసం సోడియం స్థాయి పెంచేందుకు పర్యవేక్షిస్తున్నట్లు వైద్యులు వివరించారు. యశోద ఆస్పత్రికి బిఆర్ఎస్ నేతలు భారీగా చేరుకుంటున్నారు. కెసిఆర్ ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

# ప్రశ్నించిన వారిని చంపించడమే.. సీపీఎం పార్టీ విధానమా

- బెదిరింపులకు భయపడే పార్టీ బీఎస్పీ నాయకత్వం కాదు
- దాడికి పాల్పడిన వారరిపై చర్ల మండల పోలీసు శాఖ కఠినమైన చర్యలు తీసుకోవాలి
- బీఎస్పీ సీనియర్ నాయకులు కొండా చరణ్

**జయభేరి, చర్ల, జులై 4 :**
చర్ల మండల సీనియర్ జర్నలిస్టు సూర్య రిపోర్టర్ బొబ్బిళ్ళపాటి రవికిరణ్ పై బహుజన సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు కొండా చరణ్, చెన్నం మోహన్ లపై, సీపీఎం పార్టీ నాయకులు చేసిన అత్యాయత్నంని ఖండించాలని బహుజన సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు కొండా చరణ్ అన్నారు. సీపీఎం పార్టీ నాయకత్వంలో ప్రభుత్వ భూములు ఆక్రమించడం అమాయకులకు అమ్మడం చేస్తున్నారని ఈ విషయాన్ని బట్టబయలు చేసిన బహుజన సమాజ్ పార్టీ నాయకత్వంపై వార్త రాసిన సూర్య విలేకరి బొబ్బిలపాటి కిరణ్ పై శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు బహుజన సమాజ్ పార్టీ ఆఫీసుకి సీపీఎం పార్టీ నాయకత్వం 100 మందిని తీసుకొని వచ్చి చంపే ప్రయత్నం చేశారని, ఇది అత్యంత దారుణమైన చర్యని అన్నారు. ప్రశ్నిస్తే చంపడమేనా సీపీఎం పార్టీ నీతి సిద్ధాంతం అని ప్రశ్నించారు.
తప్పు మీరు చేసి నిజాలు రాసిన విలేకరులని, ప్రశ్నించిన ఇతర పార్టీ నాయకులను చంపేస్తారా అంటూ నిలదీశారు. గుడి భూములు కబ్జా చేయటం, గుట్ట భూములు కబ్జా చేయటం మండలంలోని ప్రభుత్వ భూములు కబ్జా చేసుకొని మీ నాయకులు సొమ్ము చేసుకోవటమేనా మీ పార్టీ మీకు నేర్పిస్తున్న సిద్ధాంతం అని మండిపడ్డారు. మహిళలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడమేనా మీ విప్లవ రాజకీయాలంటే అని ప్రశ్నించారు.
పేదలకు దక్కవలసినటువంటి ప్రభుత్వ భూమిని సిపిఎం పార్టీ నాయకులు, పట్టాలు లేని వాళ్ళు కూడా పంచుకోటమేనా మీరు ప్రజలకు చేసే న్యాయమన్నారు. అమాయక ప్రజల్ని రెచ్చగొట్టి ఉసుగొల్పి మర్డర్ కేసుల్లో ఇరికించటమేనా మీ పని అని అన్నారు. బీఎస్పీ సిపిఐ పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని నాడు సీపీఎం వాళ్ళు పత్రిక ప్రకటనలు ఇచ్చారు. నేడు అదే భూమిలో సిపిఐ బీఎస్పీ పార్టీ చెప్పింది నిజమని రెవిన్యూ వాళ్లు ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు పెట్టారు. ఇప్పుడు సిపిఐ బిఎస్పీ చెప్పింది నిజమా లేక సిపిఎం పార్టీ నాయకులైన మీరు చెప్పింది నిజమా అని ప్రశ్నించారు. కల్లబొల్లి కబుర్లు చెబుతూ అమాయక ప్రజల్ని మోసం చేయొచ్చు గాని చట్టాన్ని మోసం చేయలేరని అన్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసామని అత్య చేయడానికి పార్టీ ఆఫీసులోకి చొరబడి ప్రయత్నించిన ప్రతి ఒక్కరిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని పోలీసు వారిని విన్నవించారు. లేనియెడల న్యాయ పోరాటానికి రాజ్యాంగబద్ధంగా ఎంత దూరమైనా వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు గోగికార్ లక్ష్మణ్, సామల ప్రవీణ్, చేన్నం మోహన్, గుర్రాల విజయ్ కుమార్, పర్షిక త్రిమూర్తులు, కొండా కౌశిక్, ములకల సందీప్ తదితరులు పాల్గొన్నారు.






# ఆదాసి గోవర్ధన్ కుటుంబానికి భరోసా ఆర్థిక సహాయం

**జయభేరి, కొండమల్లేపల్లి :**
తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో నల్లగొండ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండ మల్లేపల్లి అసోసియేషన్ సభ్యుడు ఆదాసి గోవర్ధన్ కుటుంబానికి, కుటుంబ భరోసా 138వ ఆర్థిక సహాయంను వారి కుటుంబానికి రాష్ట్రం నుండి 1,65,000 రూపాయలు స్థానిక అసోసియేషన్ మల్లేపల్లి మండలం నుండి 10,000 రూపాయలు దేవరకొండ మండలం నుండి 5, 500 రూపాయలు టోటల్ 1,80,500 అందించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి భీమిడి మాధవరెడ్డి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జగదీష్ గౌడ్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు పసుపులేటి కృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట మోహన్ రెడ్డి జిల్లా కోశాధికారి మేదరి భాస్కర్ కుటుంబ భరోసా ఇన్చార్జి నక్క జానయ్య గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంధం రూపేందర్ రాష్ట్ర కార్యదర్శి సమడం జయరాములు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సామల వెంకటేశ్వర్లు మల్లెపల్లి అధ్యక్షులు సురేష్, గౌరవ అధ్యక్షులు సయ్యద్ పాషా, మండల ప్రధాన కార్యదర్శి చిరం బాబు,
నల్లగొండ పట్టణ అధ్యక్షులు రవి, నలగొండ పట్టణ ప్రధాన కార్యదర్శి జనార్దన్, దేవరకొండ అధ్యక్షులు కానుగుల ఆంజనేయులు, దేవరకొండ ప్రధాన కార్యదర్శి భాస్కర్, మాజీ కోశాధికారి నీలా సంజీవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మణిదీపు, సందీప్, వివిధ హోదాలో ఉన్న ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ స్థానిక ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.



# దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయండి జీపు జాత ప్రారంభం

- సిఐటియు అధ్యక్షులు కే లోకనాథం పిలుపు

**జయభేరి, పరవాడ :**
లేబర్ కోడ్ లను రద్దు చేయాలని జులై 9 న దేశ వ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సమ్మె ప్రచార జాత లంకెలపాలెం లో శుక్రవారం లోకనాథం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కే లోకనాథం మాట్లాడుతూ కనీస వేతనాలు చట్టం అమలు చేయాలని, కార్మికుల పోరాటాల ద్వారా సాధించిన కార్మిక చట్టాలను యాజమాన్యాలు కి అనుకూలంగా మార్పులు చేసే చర్యలు విరమించాలని సమాన పనికి సమాన వేతన చట్టం అనేక కార్మిక చట్టాలను తొలగించడం దుర్మార్గమన్నారు.
కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం దొంగచాటుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి వాటిని అమలు చేయడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీనిని నిరసిస్తూ దేశంలో ఉన్న అన్ని కార్మిక , రైతు సంఘాలు జులై 9 తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి.సమ్మెను జయప్రదం చేయాలని లోకనాథం కోరారు. అసంఘటితరం కార్మిక సమగ్ర చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫార్మా పర్సనల్ లో భద్రత ప్రమాణాలు అమలు చేయాలని ఆయన అన్నారు. ప్రచార జాత పరవాడ, తానం, తాడి, ఫార్మాసిటీ, మీదగా సాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ,జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు,కే పోతి నాయుడు, కే వెంకట్రావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.




## కమిషనర్ వద్దకు వచ్చిన బిక్షాటన చేసే బాలురు

**జయభేరి, నెల్లూరు, జూలై 4:**
కమిషనర్ వద్దకు వచ్చిన బిక్షాటన చేసే బాలురు - ఏం అడిగారో తెలిస్తే మీ మనసు చివుక్కుమంటుందిసారూ మాకు చదువు చెబుతారా! అంటూ భిక్షాటన చేసుకునే ఇద్దరు బాలురు కమిషనర్‌ను వేడుకున్న దృశ్యం అందర్నీ చలించేలా చేసింది. వెంటనే స్పందించిన కమిషనర్ 'మీకు తెలిసిన పెద్దవారిని తీసుకొచ్చి, పాఠశాలలో చేరండి' అంటూ తన ఫోన్ నంబరును వారికి ఇచ్చి పంపారు. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైవో నందన్ గురువారం వీఆర్ విద్యాసంస్థల ప్రాంగణాన్ని సందర్శించగా ఓ భావోద్వేగ ఘటన చోటుచేసుకుంది. పాఠశాల వద్దకు వచ్చిన బిక్షాటన చేసే అనాథ బాలురు పెంచలయ్య, వెంకటేశ్వర్లు "సార్ మాకూ చదువు చెబుతారా?" అంటూ చేతులు కట్టుకుని కమిషనర్‌ను అభ్యర్థించడం అక్కడున్న వారిని హృదయాలను కదలించింది.లక్షల ఫీజులు కట్టి చదివిస్తున్నా కొంతమంది పిల్లలు చదవు పట్ల ఆసక్తి ప్రదర్శించరు. కానీ దుర్భర పరిస్థితుల్లో ఉన్న ఈ చిన్నారులు తమకు విద్య నేర్చుకునే అవకాశం కల్పించమని కోరడంతో కమిషనర్ చలించిపోయారు. "మాలాంటి వాళ్లకీ ఇక్కడ చదువు చెబుతారనడంతో వచ్చాం సార్, మమ్మల్ని కూడా చేర్చుకోండి" అని చిన్నారులు అనగానే కమిషనర్‌తో పాటు అక్కడున్నవారంతా ఆశ్చర్యానికి గురయ్యారు. వారి తపనను గమనించిన కమిషనర్ నందన్ స్పందిస్తూ.. "మీలాంటి వాళ్ల కోసమే ఈ పాఠశాలను ప్రారంభించారు. మీరు మీకు తెలిసిన పెద్దవారిని తీసుకొని రావాలి. వెంటనే మీకు అడ్మిషన్ ఉంటుంది" అని భరోసా ఇచ్చారు. అంతేకాదు.. తన ఫోన్ నంబర్ రాసి చిన్నారుల చేతిలో పెట్టి పంపారు. చదువు కోసం చిన్నారులు ఇలా స్వయంగా అడగడమే కాక.. అధికారుల నుంచి అండ దొరకడం అక్కడ ఉన్నవారిని ఆకట్టుకుంది.



## ఇష్టానుసారంగా నడుపుతున్న శ్రీ చైతన్య స్కూల్స్

- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా శ్రీ చైతన్య విద్యా సంస్థలు
- పట్టించుకోని జిల్లా విద్యాశాఖ అధికారి

**జయభేరి, తాండూర్ :**
తాండూరు పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ను సందర్శించిన పిడిఎస్ యు నాయకులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శి పి. శ్రీనివాస్, కె.రాజేష్ మాట్లాడుతూ శ్రీ చైతన్య టెక్నో స్కూల్స్ పూర్తి గా ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా ఎలాంటి విద్యహక్కు చట్టం ప్రకారం కూడా నియమ నిబంధనలను పాటించకుండా, ప్రభుత్వ నిర్ణయించిన సమయాన్ని మించి సాయంత్రం 5 :30 గంటల వరకు స్కూల్స్ నడుపుతూన్నారు. ఇలా చేయడం వల్ల విద్యార్థుల మైండ్ పై ప్రెజర్ పడి ఒత్తిడికి గురవుతారని దానితోపాటు దీనివల్ల విద్యార్థులు మానసికంగా కృంగిపోయే అవకాశం ఉందని తెలియజేయడం జరిగింది. ఫైర్ సేఫ్టీ లేదు, విద్యార్థుల సంఖ్య కనుగుణంగా బాత్రూమ్స్ లేవు, ఒక స్కూలుకి ఇచ్చిన పర్మిషన్ సర్టిఫికెట్స్ తో మరోచోట ఇంకో స్కూల్ పెట్టి నడిపిస్తున్నారు. శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం ప్రభుత్వం నిర్ణయించిన టెక్స్ట్ బుక్స్ ని కాకుండా మార్కుల కోసం సొంతంగా నిర్ణయించిన టెక్స్ట్ బుక్స్ ని పిల్లలకి ఇచ్చి చదివిస్తున్నారు. వాటిని కూడా అత్యధికంగా ఇంచుమించు 70,00 రూపాయల నుండి 10,000 రూపాయలకు పైగా వసుళ్లకు పాల్పడుతున్నారు. దీనివల్ల విద్యార్థికి ఇలాంటి ఉపయోగముండదు సమాజం పైన అవగాహన ఉండదు. సమాజం పైన అవగాహన లేకుంటే విద్యార్థులు వ్యవహరించే తీరు వేరు గా ఉంటుంది. కాబట్టి వారినీ అలా తయారు చేస్తున్నా శ్రీ చైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు ) డిమాండ్ చేయడం జరుగుతుంది. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు శ్రీ చైతన్య విద్యా సంస్థల పైన జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. లేనిపక్షంలో పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించడం జరిగింది.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

**జయభేరి, మేడ్చల్:**
అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ లోని కందుకూరు మండలం ముప్పల గ్రామానికి చెందిన రాంబాబు తో ప్రశాంతి (22) వివాహం సంవత్సరం కిందటే జరిగింది .వీరికి ఐదు నెలల పాప ఉంది. రాంబాబు వృత్తి రీత్యా మేస్త్రీ పని చేస్తూ ఉండేవాడు. నెల రోజుల కిందట మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్లు అద్దెకు దిగారు. శుక్రవారం ఉదయం బంధువులు రాంబాబుకి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో బంధువులు ఇంటికి వెళ్లి చూసేసరికి అప్పటికే ప్రశాంతి మృతి చెందింది. ఐదు నెలల పాప ఏడుస్తూ కనిపించింది.భర్త రాంబాబు ఇంట్లో లేకపోవడంతో హత్య చేసి పారిపోయాడని బంధువులు ఆరోపిస్తున్నారు. సంఘటన స్థలానికి మేడ్చల్ పోలీసులు చేరుకొని వివరాలను సేకరిస్తున్నారు.




## సెంటిమెంట్ మిస్ చేయని త్రివిక్రమ్.. వెంకటేష్ మూవీకి ఆ టైటిల్ ఫిక్స్ చేశారా..!

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈసారి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌కి శ్రీకారం చుట్టబోతున్నట్లు సమాచారం. ముందు అల్లు అర్జున్‌తో పాన్ ఇండియా స్థాయిలో పురాణ నేపథ్యంలో ఓ భారీ చిత్రం చేయాలని త్రివిక్రమ్ భావించగా, అది కార్యరూపం దాల్చలేదు. అదే కథను ఇప్పుడు తారక్‌తో ప్లాన్ చేస్తున్నట్లు టాక్. అయితే ఆ ప్రాజెక్ట్ మొదలయ్యేలోపు, ఓ మీడియం బడ్జెట్ చిత్రాన్ని పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నారు త్రివిక్రమ్. ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, త్రివిక్రమ్ - విక్టరీ వెంకటేష్ కాంబినేషన్‌లో ఓ కొత్త సినిమా రాబోతుందని జోరుగా ప్రచారం జరుగుతోంది.

ఇది వెంకటేష్‌కి 77వ సినిమా అవుతుందట. అధికారిక ప్రకటన వెలువడకపోయినా, ఈ ప్రాజెక్ట్‌ను సైలెంట్‌గా సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రానికి ‘వెంకట రమణ’ అనే టైటిల్ పరిశీలనలో ఉందని తెలుస్తోంది. టైటిల్‌కు “కేర్ ఆఫ్ ఆనంద నిలయం” అనే ట్యాగ్‌లైన్ పెట్టనున్నారట. త్రివిక్రమ్ సినిమాల్లో తరచుగా కనిపించే “ఇంటి సెంటిమెంట్” ఇందులోనూ ప్రధానంగా ఉండబోతోందని సంకేతాలు అందుతున్నాయి.అల వైకుంఠపురంలో, అత్తారింటికి దారేది, గుంటూరు కారం వంటి సినిమాల్లో మాదిరిగానే ఇది కూడా ఓ ఇంటి చుట్టూ తిరిగే కథ కావొచ్చని ఆలోచన చేస్తున్నారు.

వెంకటేష్ కోసం ప్రత్యేకమైన కథను త్రివిక్రమ్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇది అభిమానులను ఆకట్టుకునేలా, సింపుల్ అండ్ టచింగ్‌గా ఉండనుందట. ఈ సినిమా 2025 ఆగస్టులో సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. 2026 సమ్మర్ రిలీజ్ లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నారు. అయితే ఈ చిత్రం గురించి అధికారికంగా ఇంకా ఎలాంటి అనౌన్స్మెంట్ రాలేదు. త్వరలోనే టైటిల్, కథా విషయాలు, ఇతర నటీనటుల వివరాలు వెల్లడి అయ్యే అవకాశముంది. కాగా, వెంకటేష్..చిరంజీవి - అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కుతోన్న చిత్రంలో ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు.

## నేనేమి చేసినా ఫుల్ ట్రెండింగ్



వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు గాలి జనార్ధన రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయమవుతున్న చిత్రం ‘జూనియర్’. రాధాకృష్ణ దర్శకుడు. వారాహి చలన చిత్రం పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ వేగాన్ని పెంచారు. శుక్రవారం ‘వైరల్ వయ్యారి..’ అనే గీతాన్ని విడుదల చేశారు. దేవిశ్రీప్రసాద్ స్వరపరచిన ఈ గీతాన్ని కల్యాణ్ చక్రవర్తి రచించారు. ‘ఇన్‌స్టాగ్రామ్‌లో నా ఫాలోయింగ్ చూశావంటే మైండ్‌బ్లోయింగ్.. ఫాలోవర్స్ అందరికీ నేనే డార్లింగ్.. నేనేమి చేసినా ఫుల్ ట్రెండింగ్..’ అంటూ యూత్‌కు కనెక్ట్ అయ్యేలా సోషల్‌మీడియాలో వాడే లాంగ్వేజ్‌తో ట్రెండీగా ఈ పాట సాగింది. దేవిశ్రీప్రసాద్, హరిప్రియ ఆలపించారు. ఇందులో కిరీటి రెడ్డి, శ్రీలీల కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. జెనీలియా, రవిచంద్రన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సెంథిల్ కుమార్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, రచనదర్శకత్వం: రాధాకృష్ణ.

## ఆ చైల్డ్ ఆర్టిస్ట్ వంటలక్క కూతురా..



కార్తీక దీపం సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది ప్రేమి విశ్వనాథ్. ఇందులో వంటలక్క పాత్రలో అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. ప్రస్తుతం కార్తీక దీపం 2 సీరియల్ ద్వారా మరోసారి తెలుగు ప్రజలను అలరిస్తుంది. ఇదిలా ఉంటే.. కార్తీక దీపం సీరియల్లో వంటలక్క కూతురిగా నటించిన శౌర్య ఫోటోస్ ఇప్పుడు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. ఇందులో డేరింగ్ ఉన్న అమ్మాయిగా కనిపించి తన నటనతో ఆకట్టుకుంది. ఆ అమ్మాయి పేరు బేబి కృతిక. కార్తీక దీపం సీరియల్ ద్వారా సినీప్రియుల ప్రశంసలు అందుకుంది. బేబీ కృతిక.. చైల్డ్ ఆర్టిస్టుగా ఎన్నో సినిమాలు, సీరియల్స్ చేసింది. కార్తీక దీపం సీరియల్ తర్వాత మహేష్ బాబు, రష్మిక మందన్నా కలిసి నటించిన సరిలేరు నీకెవ్వరు సినిమాలో నటించింది. ఆ తర్వాత పలు సీరియల్స్ చేసింది. ఇక ఇప్పుడు చదువులపై ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి. అందులో కృతిక మరింత అందంగా కనిపిస్తుంది.



## చిరునవ్వుతో మాయ..

తెలుగు సినీరంగంలో సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న హీరోయిన్లలో నభా నటేశ్ ఒకరు. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ అమ్మడు.. ఆ తర్వాత బ్యాక్ టూ బ్యాక్ చిత్రాల్లో నటిస్తూ స్టార్ డమ్ అందుకుంటుందని అనుకున్నారు. కానీ అనుహ్యంగా ఇండస్ట్రీకి దూరమయ్యింది. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే యాక్సిడెంట్ కావడంతో కొన్నాళ్లపాటు ఇండస్ట్రీకి దూరంగా విశ్రాంతి తీసుకుంది. ఇక ఇప్పుడిప్పుడే సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు.. ప్రస్తుతం వచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటుంది. కథ నచ్చితే వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తుంది. ఇటీవలే డార్లింగ్ సినిమాతో అలరించిన ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న స్వయంభు చిత్రంలో నటిస్తుంది. అలాగే తెలుగు వచ్చిన ప్రతిసినిమాకు ఈ బ్యూటీ ఓకే చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. తాజాగా సోషల్ మీడియాలో ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. తాజాగా బ్లాక్ అండ్ వైట్ ఫోటోస్ షేర్ చేసింది. ఇందులో మరింత అందంగా కనిపిస్తుంది. ఇదిలా ఉంటే.. నభా నటేశ్ కమిట్ అయిన సినిమాలు ఏమి లేదు. కేవలం ఈ అమ్మడు చేతిలో స్వయంభు సినిమా మాత్రమే ఉన్నట్లు సమాచారం. అలాగే తెలుగుతోపాటు కన్నడలోనూ వరుస ఆఫర్స్ అందుకుంటుందట. కర్ణాటకలోని శృంగేరిలో జన్మించిన నభా నటేశ్.. ఇంజనీరింగ్ పూర్తి చేసింది. ప్రముఖ దర్శకుడు ప్రకాష్ బెలవాడి శిష్యురాలిగా ఎన్నో నాటకాల్లో నిటంచింది. స్కూల్ డేస్‌లోనే భరతనాట్యం నేర్చుకుంది. ఆ తర్వాత మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టి సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది.

## తెలుగులో ‘మై బేబి’గా రాబోతున్న తమిళ సూపర్‌హిట్






ఇటీవల తమిళంలో విడుదలై భారీ విజయం సాధించిన ‘డి.ఎన్.ఎ’ చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాత సురేష్ కొండేటి ఈ చిత్రాన్ని ‘మై బేబి’ పేరుతో ఈనెల జూలై 11న విడుదల చేయనున్నారు.

గతంలో ‘ప్రేమిస్తే’, ‘జర్నీ’, ‘షాపింగ్ మాల్’, ‘పిజ్జా’ వంటి 15 విజయవంతమైన చిత్రాలను నిర్మాతగా అందించిన సురేష్ కొండేటి, డిస్ట్రిబ్యూటర్‌గా 85కు పైగా సినిమాలను విడుదల చేశారు. ‘మై బేబి’ ఆయన నిర్మాణంలో వస్తున్న 16వ చిత్రం. ఈ సినిమా కూడా భారీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నెల్సన్ వెంకటేసన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తమిళంలో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అథర్వ మురళి, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్, భావోద్వేగాలతో కూడిన కథాంశంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. 2014లో ఒక సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ కథ రూపొందింది. పిల్లల అపహరణలు, ఆసుపత్రులలో పిల్లలను మార్చడం వంటి సున్నితమైన సామాజిక సమస్యలను ఈ చిత్రం స్పృశించిందని, ఇది సమాజంలో మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో మరోసారి గుర్తు చేస్తుందని చిత్ర బృందం పేర్కొంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com